క్లుప్తంగా

కూచారంలో స్వచ్ఛ భారత్



హరితవనంలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు 298వ వారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఆదివారం వారు పలు వీధులను శుభ్రపరిచి చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే హరిత వనంలో పిచ్చి మొక్కలను తొలగించారు.

పేదల కోసం జీవనజ్యోతి పథకం



బీమా చెక్కును అందజేస్తున్న రవీందర్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని గోమారం ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ రవీందర్ అన్నారు. మండల పరిధి చండి గ్రామానికి చెందిన ఉదరి మల్లేశ్ మృతి చెందడంతో జీవనజ్యోతి ప్రమాద బీమా రూ.2లక్షల చెక్కును ఆదివారం మృతుడి భార్య మంజులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమా, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మండల ఇన్‌చార్జి అశోక్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ముత్యంరెడ్డి, కుమార్‌గౌడ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

నల్లపోచమ్మా.. కరుణించమ్మా..

కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మా కరుణించమ్మా అంటూ అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు శివ్వప్ప, రాజేశ్ నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

చిలప్‌చెడ్‌లో..

చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే సునీత



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

నర్సాపూర్: బంజారా ఎంప్లాయిస్ సేవాసంఘ్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్, ప్రధాన కార్యదర్శి మనిరాం రాథోడ్, దేవీసింగ్, ఈశ్వర్, చెన్నానాయక్, గణేశ్, చందర్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలువుగా ప్రకటించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వినోద్‌నాయక్

నర్సాపూర్: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతిని సెలువు దినంగా ప్రకటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం అందజేసినట్లు గిరిజన జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాలలో సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్షంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట కృష్ణనాయక్, రాజు, రవి, శేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రేగోడ్(మెదక్): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, కో-ఆప్షన్ సభ్యుడు చోటుమియా ఆదివారం తెలిపారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- చిన్నగొట్టిముక్ల- జీడిపల్లి రోడ్డు అంటే హడల్
- ఒకే చోట 20 రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి
- చర్యలు చేపట్టాలి: వాహనదారులు



టిక్యా తండా వద్ద ప్రమాదభరితంగా ఉన్న మూలమలుపు ఇదే..

శివ్వంపేట(నర్సాపూర్): కొన్ని రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. డెత్ స్పాట్‌లుగా ఉన్న ఈ మూలమలుపుల వద్ద నిత్యం ఏదో ఒక ప్రమాదం సంభవిస్తోందని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఒకే చోట కేవలం 20 రోజుల వ్యవధిలో ఇద్దరు మృత్యువాత పడగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గతంలో కూడా ఈ మూలమలుపుల వద్ద ప్రమాదాలకు గురై పలువురు వాహనదారులు మృతి చెందిన ఘటనలు చాలానే ఉన్నాయి. ప్రాణాలు పోతున్నప్పటికీ నివారణ చర్యలు చేపట్టడంలో సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రాణాలు తీస్తున్న మలుపులు..

టిక్యా తండా వద్ద రెండు చోట్ల, గోమారం స్మశానవాటిక వద్ద ఒక చోట, సికింద్లాపూర్ గ్రామం వద్ద రెండు మూలమలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. గోమారం స్మశానవాటిక వద్దనున్న మూలమలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. 20 రోజుల వ్యవధిలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి సికింద్లాపూర్ గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాస్‌చారి, పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన గంగాన్నగారి సత్తయ్య మృత్యువాత పడగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అదే చోట సంవత్సరం క్రితం పాంబండకు చెందిన వడ్డె రమేశ్ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. మరో మూలమలుపు వద్ద 6 నెలల క్రితం మనోహరాబాదు తహసీల్దార్ భిక్షపతి కారులో వస్తుండగా అదుపుతప్పి చెట్టుకు ఢీకొనగా ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ రోడ్డు గుండా ఉన్న మూలమలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూ విలువైన ప్రాణాలు పోతుండడంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ సిబ్బంది ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డులో ప్రమాదభరితంగా ఉన్న 5 మూలమలుపుల వద్ద తక్షణం రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నిత్య ప్రమాదాలు..

నాలుగు సంవత్సరాల క్రితం మండల పరిధి చిన్నగొట్టిముక్ల నుండి మనోహరాబాదు మండలం జీడిపల్లి నేషనల్ హైవే-44 వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. అయితే ఈ రోడ్డులో పలుచోట్ల ఉన్న మూలమలుపులను సూచించే హెచ్చరికలు, సూచనలకు సంబంధించిన బోర్డులను అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

నివారణ చర్యలు తీసుకుంటాం

చిన్నగొట్టిముక్ల నుండి మనోహరాబాదు రైల్వేస్టేషన్ రోడ్డు వరకు ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చేపడతాం.

– శ్రీనివాస్, డీఈ, ఆర్అండ్‌బీ

ప్రతిరోజూ ప్రమాదాలు



సికింద్లాపూర్ గ్రామ శివారులో ఉన్న మూలమలుపుల వద్ద ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రెండు రోజుల క్రితం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మృతిచెందాడు.

– సుధాకర్‌రెడ్డి, సర్పంచ్, సికింద్లాపూర్

అధికారుల నిర్లక్ష్యం..



ప్రమాదాల నివారణ కోసం సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మూలమలుపుల వద్ద ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు నిర్మించి నాలుగేళ్లు అవుతున్నా ఏవిధమైన సూచనల బోర్డులు ఏర్పాటు చేయలేదు.

– రాంచందర్‌గౌడ్, చెన్నాపూర్

పార్కింగ్ చేసిన కారుకు నిప్పు

- పెరిగిన కార్ల టైర్లు, బైకుల దొంగతనాలు
- చర్యలు తీసుకోవాలి: బాధితులు



గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన కారు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో పార్కింగ్ చేసిన ఓ కారుకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి నిప్పుపెట్టారు. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌రెడ్డి చేగుంట స్టాండ్ సమీపంలో ఇల్లు కట్టుకొని ఓ ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో తన ఇంటి ముందు పార్క్ చేసిన మారుతీ ఆల్టో కారు టైర్లను కొందరు దుండగులు దొంగిలించి శనివారం అర్ధరాత్రి దాటాక కారుకు నిప్పు పెట్టారు. దీంతో కారు పూర్తిగా కాలి బూడిదైంది. ఉదయం లేచి తన కారు కాలిపోయిందని గుర్తించిన శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల చేగుంటతో పాటు పరిసర గ్రామాల్లో పార్కింగ్ చేసిన కార్ల టైర్ల దొంగతనాలు పెరిగి పోయాయి. పార్కింగ్ చేసిన బైకులను కూడా ఎత్తుకెళ్తున్నారు. వాహనాల దొంగతనాలు జరగకుండా పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధాని మోదీతోనే రైతులకు మేలు



మల్లుపల్లిలో డ్రోన్‌తో స్ప్రే విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చిన్నశంకరంపేట మండలం మల్లుపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అలాగే కులవృత్తిదారుల కోసం రూపొందించిన విశ్వకర్మ రుణాల గురించి తెలిపారు. అనంతరం నానో యూరియా, డ్రోన్ సహాయంతో స్ప్రే చేసే విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ప్రీతం, సర్పంచ్ లక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజు, మధు, నర్సింహులు, నారాయణ పాల్గొన్నారు.

నిజాంపేటలో..

మండల కేంద్రంతో పాటు, రజాక్ పల్లి గ్రామాలలో ఆదివారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రత్యేక వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, నోడల్ ఆఫీసర్ మురళీకృష్ణ, సర్పంచ్‌లు అనూష, సునీత, ఉప సర్పంచ్‌లు బాబు, సత్యనారాయణ గౌడ్, విద్యుత్ ఏఈ గణేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే సునీత



దుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పాపన్నపేట(మెదక్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆమెకు ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, పూజారులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కొల్చారం మండల నాయకులు ఉన్నారు.

చింతకుంట జాతరలో..

నర్సాపూర్‌రూరల్: మండలంలోని చిన్న చింతకుంటలో జరిగిన దుర్గమ్మ జాతరలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన ఈ జాతరలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు అశోక్ గౌడ్, సర్పంచ్ సురేశ్‌గౌడ్, నర్సాపూర్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, సత్యంగౌడ్, నాగరాజు గౌడ్, జ్ఞానేశ్వర్, శ్రావణ్, తొంట వెంకటి, చిన్న చింతకుంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముని అక్షింతల పంపిణీ

అయోధ్యలో శ్రీరాముని ఆలయం ప్రారంభోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా అక్షింతల పంపిణీ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఆదివారం పలు మండలాల పరిధిలోని గ్రామాలలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు అక్షింతల కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలలో రామ కీర్తనలు ఆలాపిస్తూ పాదయాత్రలు నిర్వహించారు. వీధివీధి తిరుగుతూ అక్షింతలను ఇంటింటికీ అందజేశారు.



వెల్దుర్తి(తూప్రాన్): కుకునూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న రామ భక్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో..



పెద్దశంకరంపేట ఉత్తులూర్‌లో అక్షింతల పంపిణీ



శివ్వంపేట(నర్సాపూర్): కొంతన్‌పల్లిలో ..



కౌడిపల్లి: భుజిరంపేటలో..



రేగోడ్: అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు



నర్సాపూర్ రూరల్: బ్రాహ్మణపల్లిలో...

ప్రభుత్వ విప్‌కు కురుమ సంఘం నాయకుల సన్మానం



పభుత్వ విప్‌ను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

మెదక్: పట్టణ కురుమ సంఘం నాయకులు కోరే ఎల్లయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను సన్మానించారు. సంఘం సభ్యులు కోరే వెంకట్రాములు, మొకేరే కిష్టయ్య, కోరే పోచయ్య, బంజపల్లి మల్లేశం, నంగి లింగం, పెంట బీరప్ప, మొకేరే మల్లయ్య, కోరే శివయ్య, నంగి యాదగిరి, కోరే మల్లయ్య, ఐలమొలా బీరప్ప పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో నిందితుడికి రిమాండ్

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో జరిగిన గొడవలో కారుతో ఢీకొట్టిన నిందితుడు నరేందర్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ లక్ష్మణ్‌బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత 4న కాలనీలో దాయాదులతో గొడవ పడిన నరేందర్ ఆ కోపంలో పెళ్లి బృందాన్ని తన కారుతో ఢీకొట్టాడు. దీంతో రమ్య అనే యువతి మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. కేసు నమోదుచేసి గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం అక్కన్నపేట రైల్వే స్టేషన్ సమీపంలో నిందితుడు నరేందర్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

గ్రామస్తుల వన భోజనాలు

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండలంలోని కాళ్ళకల్ గ్రామంలో గ్రామస్తులు వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నత్తి మల్లేశ్, ఎంపీటీసీ లావణ్య దంపతుల ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహ్మస్వామికి ఆదివారం ప్రత్యేపూజలు చేశారు. ధనుర్మాసం సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరిలో గ్రామస్తులంతా కలిసి వన భోజనాల కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ పూజారి నవీన్ చెప్పారు.

క్రీడల్లో యువత రాణించాలి

మర్కూక్(గజ్వేల్): గ్రామీణస్థాయి క్రీడాకారులు దేశస్థాయిలో రాణించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాములపర్తిలో మండల స్పోర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం గంగాపూర్, పాములపర్తి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు

చేగుంట(తూప్రాన్): రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిద్దిపేటలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు రాంపూర్ సర్పంచ్ కాశబోయిన భాస్కర్ తెలిపారు. దుబ్బాక నియోజకవవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో పాటు స్థానిక పార్టీ నాయకులు ఆదివారం మంత్రిని కలిసి సన్మానించినట్లు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి, చేగుంట మండలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్లు భాస్కర్ పేర్కొన్నారు. వారి వెంట రాజాగౌడ్, సతీశ్‌కుమార్, స్వామిగౌడ్, సాగర్ ఉన్నారు.



మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: ఎస్‌ఐ రాజయ్య



రేగోడ్(మెదక్): నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాజయ్య హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వాహనాలతో బయటకి వెళ్తే తప్పనిసరిగా సరైన ధ్రువపత్రాలు ఉండాలని సూచించారు. నంబర్ ప్లేట్లను మార్చి తిరిగే వారి వాహనాలపై నిఘా ఉంచామని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దని హెచ్చరించారు.

శబరిమలకు మాలధారులు



పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండల కేంద్రం నుంచి పలువురు అయ్యప్ప మాలధారులు ఇరుముడులతో శబరిమలకు తరలివెళ్లారు. ఆదివారం స్థానిక మానిక్ ప్రభు దేవాలయంలో గురుస్వామి రామచంద్రాచారి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించి అనంతరం ఇరుముడులను ధరింపజేశారు.

అభయహస్తం దరఖాస్తుల అప్‌లోడ్

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ మండలంలో ముమ్మరంగా కొనసాగుతోంది. గత నెల 28 నుండి ఈ నెల 6వ తేదీ వరకు మండలంలోని 29 పంచాయతీలలో అధికారులు ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించి అయిదు గ్యారంటీలు పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో మొత్తం 11,916 దరఖాస్తులు ఇవ్వగా 10,940 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వాటితో పాటు తెల్లకాగితంపై పలు సమస్యలపై విన్నపాలు అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయంతో పాటు ఎంఆర్‌సీ, తహసీల్దార్, ఐకేపీ, ఉపాధి హామీ, ఉన్నత పాఠశాలలు, గురుకులాలలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చి ఆ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. ఆదివారం సైతం ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగింది. ఈ నెల 17 నాటికి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.



దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు

పెద్దశంకరంపేటలో..

వారం రోజులుగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల నుండి వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆపరేటర్లు ఆన్‌లైన్ నమోదు చేపట్టారు. 17 నాటికి నమోదు పూర్తి చేయనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా తెలిపారు.

బాధిత కుటుంబాలకు మైనంపల్లి పరామర్శ

రామాయంపేట(మెదక్): పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. రెండు రోజుల క్రితం మృతి చెందిన మండలంలోని లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు తండ్రి మల్లన్నగారి సత్తయ్య కుటుంబ సభ్యులను ఆదివారం రాత్రి ఆయన పరామర్శించి ఓదార్చారు. అనంతరం రామాయంపేటలో ఇటీవల అనారోగ్యానికి గురైన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీసీసీ సభ్యుడు సుప్రభాతరావు, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మైనంపల్లి